# ఆరోగ్య ప్రదాయిని యోగా



వృక్షాసనంలో చిన్నారులు



తడాసనంలో చిన్నారులు

ఆరోగ్య సంజీవని యోగా. ప్రపంచవ్యాప్తంగా బహుళ ఆదరణ పొందిన యోగా.. వేసవి శిబిరాల్లో ప్రధాన శిక్షణ అంశంగా మారింది. ఎక్కడ సమ్మర్ క్యాంప్ నిర్వహించినా.. అక్కడ యోగా సాధనకు పదుల సంఖ్యలో పిల్లలు, పెద్దలు వస్తున్నారు. ఉదయాన్నే యోగాసనాలతో శారీరక, మానసిక దృఢత్వాన్ని పొందుతున్నారు.

- యోగా, ధ్యానంపై అంతా ఆసక్తి
- వేసవి శిక్షణ శిబిరాల్లో విశేష ఆదరణ

**పద్మనాభం :** ఆరోగ్యం కేవలం శరీరానికి సంబంధించినది కాదు. ఆరోగ్యానికి మూలాలు మనస్సులో ఉంటాయి. మనసు నిర్మలంగా, నిశ్చలంగా ఉన్న చోట వ్యాధులకు ఆస్కారం చాలా తక్కువ. శరీరాన్ని, మనసును ఒక గాడిలో పెట్టి, సమతుల్యంలోకి తెచ్చేదే యోగా. యోగాకున్న సమగ్రత, సంపూర్ణత్వం మరే ఇతర సాధారణ వ్యాయామాలకు లేదంటే అతిశయోక్తి కాదు. అందుకే పాశ్చాత్య ప్రపంచం కూడా యోగా సాధన పట్ల ఆసక్తి చూపుతోంది.

**రోజూ యోగా సాధన**

స్థానిక బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్, ఏపీ ఆయుష్ విభాగం సంయుక్తంగా వేసవి శిక్షణ శిబిరాల్లో యోగా నేర్పేందుకు శ్రీకారం చుట్టాయి. మే 1 నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు వేదికగా రోజూ ఉదయం 6.30 గంటల నుంచి 8.30 గంటల వకు యోగాలో శిక్షణ ఇస్తున్నారు. దీనికి చిన్నపెద్ద తారతమ్యం లేకుండా ఆసక్తి కనబరుస్తున్నారు. జూన్ 3 వరకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక యోగా టీచర్లను ఏర్పాటు చేశారు. వీరు శిక్షణ శిబిరం అనంతరం కూడా ఇళ్ల వద్ద నిత్యం యోగా సాధన చేసేలా పిల్లలు, పెద్దల్లో చైతన్యం నింపుతున్నారు. భావోద్వేగ నియంత్రణకు యోగా ఎంతగానో దోహదపడుతుందని, దీని సాధనకు దూరం కావొద్దని చెప్తున్నారు.

**ఆసనాలతో ఆరోగ్యం**

పద్మనాభం జెడ్పీ హైస్కూల్లో జరుగుతున్న యోగా శిక్షణ తరగతులకు చిన్నారులు, పెద్దలు కలిపి 30 మంది వస్తున్నారు. వీరికి యోగా టీచర్లు ఎం.అరుణ పద్మ, ఎ.ఉమామహేశ్వరి, సీహెచ్ నవ్య శిక్షణ ఇస్తున్నారు. విజయానందపురం జెడ్పీ హైస్కూల్లో కూడా 30 మందికి పైగా యోగా, ధ్యానం నేర్చుకుంటున్నారు. పలు రకాల్లో ఆసనాలపై శిక్షణ ఇస్తున్నారు. పిల్లల్లో పొడవు పెరగడం, రక్త ప్రసరణ జరిగి మనస్సుపై ఏకాగ్రత కుదిరేందుకు తడాసనం, చేతులు, కాళ్ల కండరాలు గట్టిపడేందుకు వృక్షాసనం, బరువు తగ్గి, నడుంనొప్పి, థైరాయిడ్ సమస్యల్ని దూరం చేసేందుకు సూర్యనమస్కారాలు ఇలా ప్రతి ఒక్క ఆసనం ప్రయోజనాన్ని వివరిస్తూ, విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపుతున్నారు.

### ఆరోగ్యంగా ఉంటాం



యోగా సాధనతో ఆరోగ్య సమస్యలు దూరమవుతాయి. మానసిక ప్రశాంతత కూడా ఉంటుంది. వారం రోజులకే యోగాతో వచ్చిన మార్పులేంటో తెలిశాయి. అందుకే ఇక ముందు కూడా రోజూ కనీసం సూర్యనమస్కారాలైనా చేయాలని నిర్ణయించుకున్నా.

– సీహెచ్ రమాదీపిక, బీటెక్ విద్యార్థిని

### ఏకాగ్రత పెరుగుతుంది



యోగాసనాలతో పొడవు పెరుగుతామని, ఏకాగ్రత పెరుగుతుందని తెలిసింది. తడాసనంతో పాటు అనేక ఆసనాలు నేర్చుకున్నాను. తడాసనం వల్ల ఏకాగ్రత పెరుగుతోంది. రక్త ప్రరణ జరుగుతుంది. కాళ్లు చేతి కండరాలు గట్టి పడతాయి రక్త ప్రసరణ బాగా జరుగుతుంది.

– పి.సింధు, విద్యార్థిని, 6వ తరగతి

### వయసుతో సంబంధం లేదు



యోగాకు వయసుతో సంబంధం లేదన్నారు. చిన్నతనం నుంచే యోగా నేర్చుకోవడం చాలా మంచిదన్నారు. క్రమశిక్షణ, జ్ఞాపకశక్తికి దోహదపడుతుందన్నారు. అందుకే పద్మనాభం జెడ్పీ హైస్కూల్లో వేసవి శిక్షణ శిబిరంలో చేరాను. యోగా, ధ్యానంలో మెలకువలు నేర్పుతున్నారు.

– టి.ఈశ్మితాశ్రీ, విద్యార్థిని, 5వ తరగతి

## క్లుప్తంగా

### 'శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి'



శ్మశాన వాటికలకు స్థలాల కోసం తహసీల్దార్‌కు విన్నవిస్తున్న పాస్టర్లు

**పద్మనాభం :** మండలంలోని 22 పంచాయితీల్లో ఉన్న క్రైస్తవులకు శ్మశాన వాటికల నిర్మాణానికి స్థలాలు కేటాయించాలంటూ పాస్టర్లు శుక్రవారం తహసీల్దార్ టి.శ్రీవల్లికి వినతి పత్రం అందించారు. మండలంలోని క్రైస్తవులందరికి కలిపి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికీ స్థలం కేటాయించాలని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం అందించిన వారిలో పాస్టర్లు దున్న అబ్రహం, జి.శామ్యూల్ తదితరులు ఉన్నారు.

### ఓఆర్ఎస్, మజ్జిగ పంపిణీ



ఉపాధి కూలీలకు మజ్జిగ అందిస్తున్న ఎంపీడీవో

**ఆనందపురం :** ఎండ తీవ్రత పెరగడంతో ఉపాధి కూలీలు వడదెబ్బకు గురికాకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఎంపీడీవో అడపా లవరాజు తెలిపారు. మండలంలోని శొంఠ్యాంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం పరిశీలించారు. ఉపాధి కూలీలకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు దాహం బారిన పడకుండా ఉండేందుకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్నామన్నారు. ప్రజా ప్రతినిధులు, దాతలు ఈ విషయంలో ఉదారంగా వ్యవహరించి కూలీలకు సాయపడాలన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కన్సల్టెంట్ తిరుమలరావు, నాయకులు లెంక రాంబాబు, పల్ల రమణ పాల్గొన్నారు.

### పెద్దిపాలెం పోస్టాఫీస్‌పై ఫిర్యాదు



పోస్టాఫీసులో బట్వాడా కాని ఉత్తరాలు

**ఆనందపురం :** మండలంలోని పెద్దిపాలెంలో ఉన్న బ్రాంచి పోస్టాఫీసుకు చేరుకుంటున్న ఉత్తరాలను గత ఆరు నెలలుగా బట్వాడా చేయడం లేదని స్థానికులు శుక్రవారం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇక్కడ బ్రాంచి పోస్టాఫీసుకు గతేడాది కొత్త అధికారిని నియమించారు. ఆయన పోస్టాఫీసుకు వస్తున్న వాటిని ప్రజలకు బట్వాడా చేయట్లేదు. దీంతో పోస్టాఫీసులో కట్టలకొద్దీ ఇవి పేరుకుపోయాయి. ఏటీఎం కార్డులు, పట్టాదారు పాసుపుస్తకాలు, చెక్కుబుక్కులు, ఇతర సమాచార పత్రాలను పంపిణీ చేయకుండా మూలన పడేశారు. గ్రామంలో పలువురికి ఉద్యోగపరమైన వర్తమానాలు, ఇతర సమాచార లేఖలు అందక పోవడంతో పోస్టాఫీసుకు వెళ్లి పరిశీలించారు. దీంతో అసలు విషయం బయటపడింది. దీంతో స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

### విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

**తగరపువలస :** చిట్టివలస రూరల్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో దాకమర్రి, అన్నవరం ఫీడర్లలో మరమ్మతులు చేపడుతున్నందున ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్టు ఏఈ జె.రాము శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో అర్బన్ పరిధిలోని బాలాజీనగర్, రూరల్‌లో అవంతి విద్యాసంస్థలు, డీవీస్ పంప్‌హౌస్, ఓక్రిడ్జ్ స్కూల్, అన్నవరం, పాతపాలెం, పెదనాగమయ్యపాలెం, చిననాగమయ్యపాలెం, జీరుపాలెం, కొసనవానిపాలెం, ఆశిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

## వర్షపు నీరు నిలిచిపోకుండా చర్యలు



సాగర్‌నగర్ బీచ్ పర్యటనలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

**కొమ్మాది :** బీచ్ పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ, అటవీశాఖ సిబ్బందితో కలసి సాగర్‌నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని ప్రధాన కాలువల్లో నెలకు రెండు సార్లు పూడికలను తొలగించాలని జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మిని ఆదేశించారు. ఎప్పటికప్పుడు భూగర్భ డ్రైనేజీలను శుభ్రపరచాలన్నారు. వర్షాకాలంలో ఎగువ ప్రాంతాల నుంచి వర్షపు నీటితో పాటు పూడికలు అధికంగా వస్తాయని, ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వైఎస్సార్ వ్యూ పాయింట్, సాగర్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఫారెస్ట్ అధికారుల అనుమతితో బీచ్‌లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాల్సిందిగా పట్టణ ప్రణాళిక అధికారి బి.సురేష్‌కుమార్‌ను, పర్యవేక్షక ఇంజినీర్ శ్యాంసన్‌రాజును ఆదేశించారు. బీచ్‌లో పలు చోట్ల డస్ట్ బిన్‌లు నిండిపోయాయని, వాటిని వెంటనే తొలగించాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. కమిషనర్ వెంట ఫారెస్ట్ ఆఫీసర్ అనంత్‌శంకర్, అదనపు కమిషనర్ డా.వి.సన్యాసిరావు, పర్యవేక్షక ఇంజినీర్లు సత్యనారాయణరాజు, వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

## తాటి ముంజలకు భలే గిరాకీ



తాటి ముంజలు తీస్తున్న గీత కార్మికుడు

**పద్మనాభం :** తాటి ముంజలతో వేసవి నుంచి కాస్త ఉపశమనం పొందొచ్చు. దీంతో తాటి ముంజలకు గిరాకీ ఏర్పడింది. మండలంలోని కృష్ణాపురం, అర్చకునిపాలెం, తునివలస, రెడ్డిపల్లి, కురపల్లి గ్రామాల్లోను విజయనగరం–శొంఠ్యాం ఆర్అండ్‌బీ రోడ్డును ఆనుకుని తాటి చెట్లు ఎక్కువగా ఉన్నాయి. ఈ చెట్ల నుంచి గీత కార్మికులు తాటి గెలల్ని దించి, కాయల నుంచి ముంజలు తీస్తున్నారు. ముంజ సైజును బట్టి డజను రూ.40–50 మధ్య విక్రయిస్తున్నారు. మద్ది జంక్షన్, పద్మనాభం జెడ్పీ బంగ్లా, రెడ్డిపల్లి శాంతినికేతన్‌ల వద్ద గీత కార్మికులు ఎక్కువగా వీటిని అమ్మకానికి పెడుతున్నారు. విజయనగరం–శొంఠ్యాం అర్అండ్‌బీపై ప్రయాణించే వాహన చోదకులు తమ వాహనాలను నిలిపి, తాటి ముంజల్ని కొనుగోలు చేస్తున్నారు. ఈ రెండు మాసాలే తాటి ముంజల ద్వారా తమకు కాస్త ఉపాధి దొరుకుతుందని గీత కార్మికులు చెప్తున్నారు.

## కాలువల్లో పూడిక తొలగింపు



చంద్రంపాలెంలో శానిటేషన్ పనులు చేపడుతున్న సిబ్బంది

**మధురవాడ :** జీవీఎంసీ 5వ వార్డు చంద్రంపాలెం పరిసర ప్రాంతాలలో జీవీఎంసీ శానిటేషన్ సిబ్బంది శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. హైవే సర్వీసు రోడ్డును ఆనుకుని ఉన్న కాల్వల్లో భారీగా పేరుకుపోయిన పూడికను, చెత్తాచెదారాన్ని తొలగించారు. వర్షాలు పడే అవకాశాలు ఉండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది పనులు చేపట్టారు.

## బూత్ కమిటీలతో పార్టీ బలోపేతం



సమావేశంలో మాట్లాడుతున్న ఉప్పాడ అప్పారావు

**తగరపువలస:** బీజేపీ తగరపువలస మండల పరిధిలో పెండింగ్‌లో ఉన్న బూత్ కమిటీలు, శక్తి కేంద్రాలను త్వరితగతిన పూర్తి చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు సూచించారు. శుక్రవారం స్థానికంగా జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీలో చేరడానికి అన్నివర్గాల ప్రజలు ఉత్సాహంగా ఉన్నట్టు తెలిపారు.

దీనికి ప్రధాని మోదీ సుపరిపాలనే కారణమన్నారు. ఒక్కో బూత్ కమిటీలో 11 మందిని నియమించాలన్నారు. మండల అధ్యక్షురాలు శీరపు రామలక్ష్మి మాట్లాడుతూ 2024లో భీమిలిలో బీజేపీ జెండా ఎగురవేస్తామన్నారు. సమావేశంలో పార్టీ స్థానిక నాయకులు కురుమెళ్ల కవిత, పెదగాడ విజయ, పంపాన సుబ్రహ్మణ్యం, తోణంగి రాము, వెంకటేశ్వరరావు, షణ్ముఖ్, త్రినాథరెడ్డి, వెంకటరెడ్డి, నీలిమ, రాంబాబు, ప్రసన్న, ధరణి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే లక్ష్యం

'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను మహిళకు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

**కొమ్మాది :** సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, అందులో భాగంగానే ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటున్నట్టు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు రుషికొండలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు ఏదో ఒక సంక్షేమ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని, అందుకే తాము ఎక్కడికి వెళ్లినా ప్రజలు నీరాజనం పడుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే చదువుకు, వైద్యానికి పెద్ద పీట వేస్తున్నామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో సంక్షేమంతో పాటు అభివృద్ధిని సరిసమానంగా పరుగులు తీయిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటికప్పుడు ఎన్నికలు లేకపోయినా ప్రజా సమస్యలు తెలుసుకుని, వాటిని అక్కడికక్కడే పరిష్కరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యేకు పలు సమస్యలు విన్నవించుకున్నారు. వీధిలైట్లు, పలు చోట్ల పాడైన డ్రైనేజీలు, అక్కడక్కడ మంచినీటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ త్వరితగతిన సమస్యల్ని పరిష్కరించాలని సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, స్థానిక నాయకులు ఉప్పులూరి గోపి, చెన్నాదాసు, అల్లాడ ఉమామహేశ్వరరావు, నొడగల రాంబాబు, శ్రీనివాసరెడ్డి, మాదు బుజ్జి, రమణమూర్తి, అప్పలరాజు, భాస్కరరావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## ఐరిస్ నమోదు పరికరాల పంపిణీ



ఐరిస్ నమోదు పరికరాలతో రేషన్ వ్యాన్ల నిర్వాహకులు

**భీమునిపట్నం:** భీమిలి, ఆనందపురం మండలాల్లో రేషన్ సరకులు అందించే వ్యాన్‌ల నిర్వాహకులకు ఐరిష్ నమోదు పరికరాలను శుక్రవారం పంపిణీ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దారు కృష్ణారావు, పరికరాల సర్వీస్ ఇంజినీర్ ఆర్.ప్రభాకర్‌నాయుడు చేతుల మీదుగా వీటిని అందించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఇంటింటికీ రేషన్ అందించే విధానం వల్ల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉందన్నారు. రేషన్ ఇచ్చేటపుడు కొందరికి వేలిముద్రలు పడకపోవడంతో వారికి సరకులు ఇవ్వడానికి ఇబ్బందికరంగా మారిందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కొత్తగా కళ్లను స్కాన్ చేసే ఐరిస్ పరికరాలను అందించిందన్నారు. ఇకపై వేలిముద్రల సమస్య ఉండదని పేర్కొన్నారు. దీంతో ప్రతి ఒక్కరికీ రేషన్ అందుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో భాగంగా ఇక్కడకు వచ్చిన 55 మంది రేషన్ వ్యాన్‌ల నిర్వాహకులకు పరికరాలను ఎలా వినియోగించాలో వివరించారు.

### శిథిల భవనంతో భయం భయం



బొట్టవానిపాలెంలో శిథిలావస్థకు చేరి పశువుల కొట్టాంగా మారిన పాఠశాల భవనం

**మధురవాడ :** ఒకప్పుడు విద్యార్థులతో కళకళలాడిన పాఠశాల అది. వందల మంది విద్యార్థులకు బతుకు పాఠాలు నేర్పింది. ఇదంతా పదేళ్ల క్రిందటి మాట. ఇపుడా పరిస్థితి లేదు. జీవీఎంసీ 5వ వార్డు బొట్టవానిపాలెంలో పాత పాఠశాల గురించే ఇదంతా. ఇపుడా భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పెచ్చులూడి పశువుల కొట్టాంగా మారింది. ఊరి మధ్యలో ఉన్న ఈ శిథిల భవనంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు భయపడుతున్నారు. ఈ భవనం 1984 ప్రాంతంలో అప్పటి ఎమ్మెల్యే గుడివాడ గురునాథరావు హయాంలో ప్రారంభించారు. భవనం పాడుబడిపోవడంతో పదేళ్ల క్రితం దీన్ని వినియోగించట్లేదు. దీనికి సమీపంలోనే కొత్త భవనం నిర్మించడంతో నిరుపయోగంగా వదిలేశారు. నగరంలో ఎంతో విలువైన ప్రాంతంలో ఉన్న భవన స్థలం ఇప్పటి ధరల్లో రూ.కోట్లలోనే ఉంటుంది. దీనిని తొలగించి, ప్రభుత్వ, స్థానిక ప్రజల సామాజిక అవసరాలు కోసం ఉపయోగపడేలా నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికే పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నారు.

## త్వరితగతిన టిడ్కో ఇళ్లలో మౌలిక వసతులు

అధికారులకు ప్రత్యేకాధికారి కోటేశ్వరరావు ఆదేశం



ఇళ్లను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి కోటేశ్వరరావు

**ఆనందపురం :** నిర్మాణ పనులు పూర్తి అయిన టిడ్కో ఇళ్లకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని సీడీఎంఏ, జిల్లా ప్రత్యేకాధికారి పి.కోటేశ్వరరావు సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలోని దబ్బందలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దబ్బందలో 1920 ఇళ్ల నిర్మాణానికి పనులు ప్రారంభించగా, 1728 ఇళ్ల పనులు పూర్తయినట్టు వెల్లడించారు. మిగిలిన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు రావాలని సూచించారు. పూర్తయిన బ్లాకుల వద్ద బీటి రోడ్లు, కాలువలు, వంతెనలు, విద్యుత్, భూగర్భ డ్రైనేజి వ్యవస్థలతో పాటు ఓవర్ హెడ్ ట్యాంక్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. లబ్ధిదారులకు ఇళ్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు, బ్యాంక్ రుణ సదుపాయాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా వీటిని ప్రారంభించేందుకు అవకాశాలున్నాయని, పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. అనంతరం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో అమలవుతోన్న అభివృద్ధి పనుల్ని పరిశీలించారు. వెల్లంకిలో అంగన్‌వాడీ కేంద్రం, రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. గుడిలోవలో జరుగుతున్న భూ రీసర్వేను, లొడగలవానిపాలెంలో జగనన్న కాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ప్రాజెక్ట్ డైరెక్టర్ పాపునాయుడు, డీపీవో చక్రవర్తి, కార్యనిర్వాహక ఇంజినీరు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## 'మైదానం ఏర్పాటుకు కృషి'



విన్నర్స్ పెదనాగమయ్యపాలెం జట్టుకు ట్రోఫీ, నగదు అందిస్తున్న కోలా గురువులు

**తగరపువలస :** దివీస్ లేబరేటరీ యాజమాన్యంతో చర్చించి త్వరలో పెదనాగమయ్యపాలెంలో క్రీడాకారులకు చక్కటి వసతులతో గ్రౌండ్ ఏర్పాటుకు కృషి చేస్తానని రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ కోలా గురువులు తెలిపారు. శుక్రవారం మండలంలోని పెదనాగమయ్యపాలెంలో గరికిన సింహాద్రి మెగా క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకల్లో పాల్గొని, క్రీడాకారులకు ట్రోఫీలు, నగదు బహుమతులు అందించారు. ఈ నెల 8 నుంచి 19 రోజుల పాటు జరిగిన టోర్నమెంట్‌లో 52 జట్లు పాల్గొన్నాయి. విన్నర్‌గా కెప్టెన్ తోట ఎల్లాజీ సారథ్యంలోని పెదనాగమయ్యపాలెం జట్టు ట్రోఫీతో పాటు రూ.20వేల నగదు బహుమతి గెలుచుకుంది. రన్నర్‌గా అన్నవరం జట్టు ట్రోఫీ, రూ.10వేలు, తృతీయ స్థానంలో చిననాగమయ్యపాలెం జట్టు ట్రోఫీ, రూ.5 వేలు నగదు బహుమతులు గెలుచుకున్నాయి. విజేతలను కోలా గురువులు అభినందించారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా సూరాడ పండు, బెస్ట్ వికెట్ కీపర్‌గా సూరాడ అమ్మోరు బహుమతులు గెలుచుకున్నారు. కార్యక్రమంలో దూడ ధనంకొండ, బడే ఎల్లారావు, గరికిన పరశురామ్, సరగడ అప్పారావు, డీఎఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి ఫుట్‌బాల్ శిబిరం ప్రారంభం



ఫుట్‌బాల్ శిబిరాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు

**తగరపువలస :** జీవీఎంసీ ఆధ్వర్యంలో ఉచిత వేసవి ఫుట్‌బాల్ శిబిరాన్ని శుక్రవారం చిట్టివలస బంతాట మైదానంలో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు ప్రారంభించారు. అండర్–11, 12, 13, 14 విభాగాలకు చెందిన చిన్నారులకు ఇక్కడ శిక్షణ ఇవ్వనున్నారు. శిబిరంలో పాల్గొన్న చిన్నారులకు జీవీఎంసీ పౌష్టికాహారాన్ని అందిస్తుందని చిట్టివలస పోలమాంబ ఫుట్‌బాల్ క్లబ్ ప్రధానకార్యదర్శి అక్కరమాని చినబాబు పేర్కొన్నారు. ఫుట్‌బాల్ క్రీడాకారులు నమ్మి రాము, కంఠిమహంతి మహేష్, బోర చిన్నారెడ్డి, అనకాపల్లి శివ, చేట్ల వెంకట్, సిమ్మల ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

### వివాహిత అదృశ్యంపై కేసు నమోదు



పీరుపల్లి పద్మ

**భీమునిపట్నం :** భీమిలిలో వివాహిత అదృశ్యంపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఎగువపేటకు చెందిన పీరుపల్లి కొండ(ఆటోడ్రైవర్) భార్య పీరుపల్లి పద్మ(25) ఈ నెల 22న భర్తతో ఏర్పడ్డ గొడవ కారణంగా ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈమె కోసం భర్త కొండ, కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో వీరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### శిథిలావస్థలో డ్రైనేజీలు

**తగరపువలస :** భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డులో డ్రైనేజీలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటిలో పిచ్చి మొక్కలు, పూడిక, విరిగిన విద్యుత్ స్తంభాలు దర్శనమిస్తున్నాయి. కాళ్లవీధి, మొకర నారాయణరావు విగ్రహం, సుభాష్ వీధి మురుగు కాలువలు మరమ్మతులకు గురయ్యాయి. వీటిలో పూడికలు తొలగించి, మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



కళాశాల రోడ్డులో పిచ్చిమొక్కలతో కాలువ

### ఉన్నత భవిష్యత్తుకు ఇంటర్న్‌షిప్ కీలకం



ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్న విద్యార్థులు

**ఆనందపురం :** వృత్తిపరమైన విద్యను అభ్యసించిన వారి భవిష్యత్తుని తీర్చిదిద్దడంలో ఇంటర్న్‌షిప్ కీలక పాత్ర పోషిస్తుందని రసపూర్ణ ఫుడ్స్ సంస్థ డైరెక్టర్ ఎన్ఎస్ఆర్ ప్రభాకర్ తెలిపారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం(ఐఐఎంవి)లో మొదటి సంవత్సరం ఎంబీఏ చదువుతున్న 11 మంది విద్యార్థులు తమ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాంలో భాగంగా నగరంలోని రసపూర్ణ ఫుడ్స్ సంస్థలో చేసిన ఇంటర్న్‌షిప్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. శిక్షణ పొందిన విద్యార్థులు మాట్లాడుతూ స్వీట్లు తయారీ, బేకరీ నిర్వహణ వంటి అంశాలను నేర్చుకున్నామన్నారు.